క్లుప్తంగా

జాతీయ జెండాతో జాతి చైతన్యం సాధ్యం



భీమవరం: జాతీయజెండాతో ర్యాలీ కేజీఆర్ఎల్ కళాశాల విద్యార్థులు

భీమవరం: జాతీయ పతాకం, జాతీయ గీతం, వందేమాతరం గీతాలు జాతిని చైతన్య పరుస్తున్నాయని స్థానిక కేజీఆర్ఎల్ కళాశాల ప్రిన్సిపల్ ఇంటి శ్రీరామచంద్రమూర్తి అన్నారు. భారత స్వాతంత్ర్య దినోత్సవాల్లో భాగంగా గురువారం కేజీఆర్ఎల్ విద్యాసంస్థలు, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో 400 మీటర్ల జాతీయ జెండాతో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పీజీ కళాశాల డైరెక్టర్ కవల నాగేశ్వరరావు, తోట రామ్మూర్తి, చెరుకువాడ రంగసాయి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్, జీటీపీ మహిళ బీఈడీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన వరిచేలు



ముంపునకు గురైన వరిచేలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి శ్రీనివాస్

ఉండి: దలంలో గత రెండురోజులుగా కురిసిన వర్షాలకు వెయ్యి ఎకరాల్లో వరి పొలాలు ముంపునకు గురైనట్లు మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ తెలిపారు. ఈ నేపథ్యంలో గురువారం మండలంలోని ఉప్పులూరు, కోలమూరు, పాములపర్రు, ఎన్నార్పీ అగ్రహారం, పాందువ్వ, పాందువ్వ ఖండ్రిక, పెదపుల్లేరు, చెరుకువాడ తదితర గ్రామాల్లో సుమారు 1000 ఎకరాల వరిసాగు ముంపులో ఉందని ప్రాథమిక అంచనా వేశామని తెలిపారు. రైతులు వరి పొల్లాలో నిలిచి ఉన్న నీటిని బయటకు పంపేలా తగు చర్యలు తీసుకోవాలని ఏఓ సూచించారు.

సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు చేయాలి



ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మాట్లాడుతున్న శ్రీనగవీర్ల

భీమవరం: సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలను అభివృద్ధి చేసి భవిష్యత్తులో వాటితో ఉత్పత్తులుగా తీసుకువచ్చే విధంగా విద్యార్థులు హేక్తాన్ పోటీల్లో మంచి యాప్‌లు అభివృద్ధి చేయాలని సీసీసీ గ్రూప్ ఫౌండర్, సీఈఓ ఉండవల్లి శ్రీనగవీర్ల అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం వేదిక్ విజన్ 2కే 25 కార్యక్రమంలో భాగంగా 24 గంటల పాటు నిర్విరామంగా నిర్వహించే హ్యాకథాన్ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు నిరంతర అధ్యయనంతోనే నూతన అన్వేషణలు వెలుగు చూస్తాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షుడు సాగి విఠల్‌రంగరాజు, డైరెక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు, ఫిజికల్ డైరెక్టర్ పి సత్యనారాయణరాజు, డీన్ అకడమిక్స్ వి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రాష్ట్రస్థాయి పాటల పోటీలు

నరసాపురం: పట్టణంలోని వలందర్‌రేవు వద్ద శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవాల్లో భాగంగా మదర్‌థెరిస్సా దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి పాటల పోటీలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు గురువారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయని, విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

భీమవరానికి రోడ్ల శాపం

- పట్టణంలో అధ్వానంగా రోడ్లు
- వర్షానికి గోతుల్లో నీళ్లు నిలబడడంతో ప్రజల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లా ప్రధాన కేంద్రమైన భీమవరానికి రోడ్లు శాపంగా మారాయి. పట్టణంలో కీలక రోడ్లు గోతులమయంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భీమవరం పీపీ రోడ్డు దగ్గర నుంచి వార్డుల్లోని రోడ్లు సైతం దారుణంగా దెబ్బతిన్నా, కనీసం మరమ్మతులు చేయించకపోవడం గమనార్హం. రోడ్లన్నీ గోతులమయంగా మారడంతో చినపాటి వర్షానికే చిత్తడిచిత్తడిగా మారుతున్నాయి. పెద్దఎత్తున వర్షం వస్తే నీట మునిగిన గోతుల రోడ్లతో ప్రయాణికులు నరకం చూస్తున్నారు. ముఖ్యంగా ద్విచక్రవాహనదారులు, కాలినడకన వెళ్లే వారు ఇబ్బందులు పడుతున్నారు. భీమవరం 39 వార్డులు ఉండగా దాదాపు అన్ని వార్డుల్లో రెండు నుంచి మూడు రోడ్లు గోతులతో ఉన్నాయి. దాంతో వార్డు ప్రజలు దెబ్బతిన రోడ్లపై రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నారు.

వర్షకాలానికి ముందు పట్టించుకోని వైనం

భీమవరం పట్టణంలో రోడ్లు అధ్వానంగా ఉన్నప్పటికి వర్షకాలనికి ముందు అంటే వేసవిలో దెబ్బతిన్న రోడ్లు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 14 నెలల కాలంలో అక్కడక్కడ ఒకటి రెండు రోడ్లు మాత్రమే వేశారు. మిగిలిన రోడ్లు నిర్మాణం గానీ, రోడ్డుపై నీళ్లు నిలబడకుండా డ్రెయిన్లు నిర్మాణం పనులు చేపట్టలేదు. అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో కూడా సరైన డ్రెయినేజి వ్యవస్థ లేకపోవడంతో రోడ్డుపై వర్షం నీళ్లు ఉండిపోయి సీసీ రోడ్లు దెబ్బతింటున్నాయి..



బాంబే సిట్స్ సెంటర్‌లో ప్రధాన రహదారిపై ఏర్పడిన గోతుల్లోకి చేరి వర్షపు నీరు

గ్రేడ్ వన్ మున్సిపాలిటిలో ఈ పరిస్థితా?

జిల్లాలో పెద్ద మున్సిపాలిటి గ్రేడ్ వన్ మున్సిపాలిటిగా ఉండి కోట్లల్లో ఆదాయం కలిగిన భీమవరం మున్సిపాలిటిలో రోడ్లు అధ్వానంగా ఉండడం సిగ్గుచేటని ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రజల నుంచి పన్నులు, ఇతర ఆదాయం కోట్లు వస్తున్నప్పటికీ మౌలిక సదుపాయాల్లో ముఖ్యమైన రోడ్లు నిర్మాణం చేపట్టకపోవడం దారుణమని పేర్కొంటున్నారు. మున్సిపాలిటి నుంచి కోట్లు ఆదాయన్ని జమ చేసుకుంటున్న కూటమి ప్రభుత్వం భీమవరం అభివృద్ధి కోసం పైసా ఖర్చు చేయడం లేదని బహిరంగంగానే విమర్శిస్తున్నారు. అయితే ఉన్నతాధికారులు మాత్రం రోడ్లు గురించి పట్టించుకోకుండా సీఎస్ఆర్ ఫండ్స్ దాతల నుంచి తీసుకుని పార్కులు, బస్‌షెల్టర్లు నిర్మిస్తున్నారు. కానీ భీమవరంలో దెబ్బతిన రోడ్లు గురించి అటు జిల్లా ఉన్నతాధికారులు, ఇటు స్థానిక అధికారులు పట్టించుకోవడం మానేశారు. భీమవరం పట్టణం మీదుగా వెళ్లే పాలకొల్లు- పామర్రు రోడ్డు (పీపీరోడ్డు), పట్టణంలోని జువ్వలపాలెం రోడ్డు భీమవరం పట్టణం అనేక చోట్లు దెబ్బతిని గోతులతో అధ్వానంగా ఉంది. వర్షం పడితే చాలు గోతులు నీటితో నిండుతున్నాయి. దాంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, నాయకులు స్పందించి పట్టణంలోని రోడ్లు అభివృద్ధి చేయాలని భీమవరం ప్రజలు కోరుతున్నారు.



గోతులతో అధ్వానంగా ఉన్న జంట కాలువల రోడ్డు



యూత్ క్లబ్ సమీపంలో డ్రైయిన్ నిర్మాణం లేక రోడ్డు నిలబడిన వర్షపు నీరు



గోతులమయంగా ఉన్న రవాణా శాఖ కార్యాలయానికి వెళ్లే రోడ్డు

రోడ్లు అధ్వానంగా ఉన్నాయి



భీమవరంలో రోడ్లు దెబ్బతిని గోతులతో అధ్వానంగా ఉన్నాయి. వర్షం పడితే చాలు గోతుల్లో నీళ్లు చేరి రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నాం. కొన్ని రోడ్లపై కంకర వేసి సీసీ, తారు వేయకుండా వదిలిశారు. వర్షాలకు కంకరు కొట్టుకుపోయి గోతుల పడడంతో ద్విచక్రవాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పీపీ రోడ్డు, జువ్వలపాలెం రోడ్డు బొంబే స్వీట్స్ మలుపు వద్ద ఉన్న గోతులు ప్రమాదకరంగా ఉన్నాయి.

– మారోజు గణేష్ భీమవరం

వేసవిలో పట్టించుకోలేదు



భీమవరంలో వార్డులతో పాటు మెయిన్ రోడ్డు కూడా గోతులతో అధ్వానంగా ఉన్నాయి. వేసవిలో మున్సిపాలిటి నిధులతో దెబ్బతిన్న రోడ్లు నిర్మించలేదు. దాంతో వర్షం పడితే చాలు రోడ్డుపై ఉన్న గోతులు నిండిపోతున్నాయి. డ్రెయినేజిల నిర్మాణం చేయపోవడంతో బాగున్న సీసీ రోడ్లుపై వర్షం నీళ్లు నిలబడిపోతున్నాయి. దాంతో క్రమేపి సీసీ రోడ్లు కూడా దెబ్బతింటున్నాయి.

– చిగురుపాటి సందీప్ భీమవరం

మావుళ్లమ్మ సేవలో మానవ హక్కుల సంఘం చైర్మన్



మావుళ్లమ్మను దర్శించుకుంటున్న వెంకటరమణ దంపతులు

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణ ఇలవేల్పు శ్రీ మావుళ్లమ్మ వారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల సంఘం చైర్మన్ ఎం.వెంకట రమణ దంపతులు గురువారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఉప ప్రధాన అర్చకులు కొడమంచిలి కొప్పేశ్వర రావు పూజలు, ఆశీర్వచనలు నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మీ నగేష్ అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు.

ముంపులో చినకాపవరం డ్రెయిన్ ఆయకట్టు



సమతానగర్ రోడ్డులో వంతెన వద్ద మేటవేసిన గుర్రపుడెక్కను తొలగిస్తున్న దృశ్యం



సిద్ధాపురం రైల్వే గేటు సమీపంలో నీట మునిగిన పంట పొలాలు

వంతెనల వద్ద తిష్టవేసిన గుర్రపుడెక్క

ఆకివీడు: దుక్కి వర్షానికే చినకాపవరం డ్రెయిన్ ఆయకట్టు పంట పొలాలు ముంపుకు గురవుతున్నాయని ఆ ప్రాంత రైతు, వైఎస్సార్‌సీపీ నాయకుడు మోటుపల్లి రాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో చినకాపవరం డ్రెయిన్‌లో గుర్రపుడెక్క తొలగింపుకు చర్యలు చేపట్టారు. అయితే ఎగువ ప్రాంతం నుండి వస్తున్న గుర్రపుడెక్కతో పాటు, స్థానికంగా కాలువలో ఉన్న గుర్రపుడెక్క, తూడు మేటవేయడంతో నీటి ప్రవాహం మందగించి, ఆయకట్టు భూములపై వర్షపు ముంపునీరు పడుతోంది. దీంతో ఇటీవల నాట్లు వేసిన వరి పొలాలకు తీవ్ర నష్టం ఏర్పడే ప్రమాదం ఉందని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. సంబంధిత కాంట్రాక్టర్ మనుషులతో తూడు తొలగింపు పనులు చేపడుతున్నారని, దీని వల్ల ఎగువ ప్రాంతం నుంచి ముంచుకువస్తున్న ముంపునీరు వెంకయ్య వయ్యేరు కాలువ నుంచి చినకాపవరం డ్రెయిన్‌లోకి వదిలివేస్తున్నారు. దీంతో ముంపు బెడద మరింత తీవ్రతరమయ్యే ప్రమాదం ఉందని ఆయన వాపోతున్నారు. పొక్లెయిన్‌తో వంతెనల వల్ల మేట వేసిన గుర్రపుడెక్కను తొలగించాలని రాజు డిమాండ్ చేశారు. సిద్ధాపురం వంతెన వద్ద, సమతానగర్ వంతనకు సమీపంలో కాలువలో మేటవేసిన కిక్కిసను తొలగించాలని సూచించారు. అధికారులు తీవ్రంగా స్పందించకపోతే తీవ్ర నష్టం తప్పదన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

భీమవరం: భీమవరం వన్‌టౌన్ పరిధి తాడేరు రోడ్డులో ఈ నెల 11న జరిగిన రోడ్డు ప్రమాదంలో సీహెచ్ లీలా వెంకట శివరామ్ గాయపడినట్లు పోలీసులు తెలిపారు. తాడేరు నుంచి ద్విచక్రవాహనంపై వస్తుండగా వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టిందన్నారు. గాయపడిన యువకుడు విజయవాడలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడన్నారు. అక్కడి నుంచి వచ్చిన సమాచారం మేరకు ఎస్సై ఎస్. కృష్ణాజీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.

కోపల్లె సొసైటీ ప్రమాణ స్వీకారం

కాళ్ల: ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకుని రైతులకు సేవలందించాలని ఏపీ డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు అన్నారు. మండలంలోని కోపల్లె సొసైటీ చైర్మన్‌గా నంద్యాల రామరాజు, సభ్యులుగా గడి రాము, బుంగా ఆదాము గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. కోపరేటివ్ డీసీఓ ఎస్.మురళీకృష్ణ, సీఈఓ జె.సాయిగీత పాల్గొన్నారు.

'మా బతుకుల్లో బాబు, పవన్ నిప్పులు పోశారు'



ఉండిలో నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు

ఉండి: ఆటో డ్రైవర్ల జీవితాల్లో చంద్రబాబు నిప్పులు పోశారని ఉండి ఆటో డ్రైవర్లు తమ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం నుంచి రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ఇస్తున్నారు కానీ ఆటో డ్రైవర్‌ల పరిస్థితి ఏంటి? అని ప్రశ్నిస్తూ గురువారం ఉండిలో ఆటో డ్రైవర్లు నిరసన తెలిపారు. ఆటోలు నిలిపివేసి ఆందోళన చేశారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు ఆటో డ్రైవర్లు ఎంతో పాటుపడ్డారని అందుకు బహుమానంగా మాజీవితాలను నట్టేట ముంచేశారని కన్నీటి పర్యంతమయ్యారు. ఫ్రీ బస్సు వల్ల రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆరు లక్షల మంది ఆటో డ్రైవర్లు జీవితాలు తలకిందులవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన రూ.10 వేలు తొలగించి అధికంగా ట్యాక్స్‌లు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రూ.15 వేలు ఇస్తామన్నారు కానీ ఇంత వరకు ఇవ్వలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో ఉండి యూనియన్ కార్యదర్శి తిరునగరి రమేష్, గురివిల్లి శ్రీను, రణస్తుల శివ, మంతెన చిన్నంనాయుడు, యజ్జవరపు అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వారాల పండుగ



కలశాలతో ఊరేగుతున్న భక్తులు

ఉండి: మండలంలోని ఎన్నార్పీ అగ్రహారం బీసీ కాలనీలో వారాల పండుగను ఘనంగా నిర్వహించారు. గురువారం కాలనీలోని శ్రావణమాసాన్ని పురస్కరించుకుని వినాయకుడి గుడి వద్ద నుంచి భక్తులు పెద్ద ఎత్తున కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. విచిత్ర వేషధారణలు, తీన్‌మార్ వాయిద్యాలతో వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. ముఖ్యంగా డీజే సౌండ్స్‌తో యువత కేరింతలు కొడుతూ నిర్వహించిన కార్యక్రమాన్ని రెండు గ్రామాల ప్రజలు, భక్తులు ఆసక్తిగా తిలకించారు.

గుడాల గోపికి ప్రముఖుల పరామర్శ



గోపిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, చినమిల్లి వెంకటరాయుడు, గూడూరి ఉమాబాల



చిన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు

వీరవాసరం: పాలకొల్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) సోదరుడు గుడాల వెంకట సుబ్బయ్య (చిన్నా) ఇటీవల అనారోగ్యంతో మరణించారు. గురువారం శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, గూడూరి ఉమాబాల, భీమవరం నియోజకవర్గ ఇన్‌చార్జి చినమిల్లి వెంకటరాయుడు తదితరులు గోపీని పరామర్శించారు. అనంతరం చిన్నా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారి వెంట జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మానుకొండ ప్రదీప్‌కుమార్, గాదిరాజు రామరాజు, నేతల జ్ఞాన సుందర్రాజు, సీహెచ్ సందీప్, డీవీడీ ప్రసాద్, వి.ప్రవీణ్, పాలా నాగరాజు తదితరులు ఉన్నారు.

కాండం కుళ్లు తెగులుపై అప్రమత్తత అవసరం



బొండాడలో తెగులు సోకిన వరి దుబ్బులను పరిశీలిస్తున్న ఏఓ రమేష్ నాయుడు

కాళ్ల: వరిలో వచ్చే కాండం కుళ్లు తెగులుపై రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ శాఖ అధికారి పి.రమేష్ నాయుడు సూచించారు. మండలంలోని బొండాడలో గురువారం తెగులు సోకిన వరిపొలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిలీంద్రం ఆశించడం వల్ల కాండం లోపల, కడుపులో మధ్య భాగమంతా నల్లగా మారుతుందన్నారు. తద్వారా వరిపిలకలు కిందకు వాలిపోయి, క్రమంగా దుబ్బు అంతా ఎండిపోతుందన్నారు. ఎండిన పిలకలు చీల్చి చూస్తే లోపలి భాగంలో నల్లని చిన్నచిన్న శిలీంద్రబీజాలు కనపడతాయని తెలిపారు. పొలంలో మురుగునీరు పారుదల లేకపోవడం వల్ల ఈ తెగులు ఉధృతి పెరుగుతుందని రైతులకు సూచించారు. ఈ తెగులు గుర్తించిన మొదటి దశలో హెక్సాకోనాజోల్ లేదా వాలిడమైసిన్ లేదా టేబుకోనజోల్ 2.00 ఝు లీటర్ నీటికి కలిపి 15 రోజులకు ఒకటికి రెండుసార్లు పిలకలు కింద వరకు తడిచేటట్లు ముందు పిచికారీ చేయాలని రైతులకు సూచించారు.

సమయ మార్పుపై పారిశుద్ధ్య కార్మికుల ఆందోళన



భీమవరంలో మునిసిపల్ కమీషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

భీమవరం: పారిశుద్ధ్య కార్మికులు తెల్లవారుజామున 4 గంటలకే విధులకు హాజరుకావాలని ఇచ్చిన ఆదేశాలను తక్షణం ఉపసంహరించుకోవాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారి మల్లేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ జేఏసీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు గురువారం మునిసిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డికి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా భీమవరంలో కొత్తగా సమయాలను మార్చడంపై పునరాలోచించాలన్నారు. ఆదివారం సెలవు రోజున సైతం పనులు చేయాలని లేకుంటే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.వాసుదేవరావు, ఏఐసీటీయూ జిల్లా కార్యదర్శి కొల్లాబత్తుల మహంకాళి, జేఏసీ నాయకులు నీలాపు శ్రీను, ఎం.ఆంజనేయులు, నీలాపు రాము, బంగారు వరలక్ష్మి, కొల్లాబత్తుల యోహాను పాల్గొన్నారు.

బార్ల ఏర్పాటుకు విధివిధానాల విడుదల

పాలకొల్లు సెంట్రల్: బార్ల ఏర్పాటుకు సంబంధించిన విధివిధానాలను ఎక్సైజ్ సీఐ ఎం.శ్రీనివాసరావు గురువారం విడుదల చేశారు. పట్టణ పరిధిలో 2025–28 వరకు మూడు సంవత్సరాలు బార్ల ద్వారా మద్యం అమ్మకాలు చేసేందుకు లాటరీ ద్వారా వీటిని కేటాయించనున్నట్టు తెలిపారు. పాలకొల్లు మునిసిపల్ పరిధిలో ఉన్న 6 బార్లకు ఓపెన్ కేటగిరిలో ఏ 4 షాపులు ఎలా కేటాయించారో అదేవిదంగా బార్లను కూడా కేటాయిస్తామని పేర్కొన్నారు. అన్ని బార్లు లాటరీ ద్వారా కేటాయిస్తామన్నారు. గీత కులాలకు కేటాయించే బార్లను ప్రత్యేక నోటిఫికేషన్ ద్వారా లాటరీ తీస్తామన్నారు. ఒక వ్యక్తి ఎన్ని అప్లికేషన్‌లైనా వేసుకోవచ్చని, ఎన్ని బార్లు తగిలినా వాటిని కొనసాగించుకోవచ్చని తెలిపారు. ప్రతి బార్‌కు కనీసం నాలుగు దరఖాస్తులు వస్తేనే డ్రా తీస్తామని స్పష్టం చేశారు.

డ్రగ్స్‌రహిత సమాజం కోసం కృషి



ఎక్సైజ్ శాఖ కార్యాలయం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

భీమవరం: డ్రగ్స్‌రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎక్సైజ్ శాఖ భీమవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.బలరామరాజు అన్నారు. గురువారం భీమవరం ఎక్సైజ్ శాఖ కార్యాలయం వద్ద ఈగల్ శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిషేధంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బలరామరాజు మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగంతో యువతపై తీవ్ర ప్రభావం పడుతుందని గంజాయి రవాణా, వినియోగం, ఇతర మత్తు పదార్థాలపై నిఘా ఉంచామన్నారు. ఈగల్ సభ్యుడు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ రైల్వే, ఆర్టీసీ బస్సుల్లో మాదకద్రవ్యాల నియంత్రణకు సంబంధించి వివరాలతో అవగాహన పోస్టర్స్ ఏర్పాటు చేయాలని సూచించారు.

ప్రకటన

నా క్లయింటు కరణపు (కరణం) వెంకట రమణ భర్త కరణపు సోమేశ్వర అప్పారావు @ సోమేశ్వరరావు 54 సం।।లు డోర్ నం. 1-120, గాంధీ పేట, విస్సాకోడేరు, పాలకోడేరు మండలం, పశ్చిమగోదావరి జిల్లా నాకు యిచ్చిన భోగట్టా మేరకు ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా

పశ్చిమగోదావరి జిల్లా, పాలకోడేరు మండలం, విస్సాకోడేరు గ్రామం సందలి ఆర్.యస్.నం.318 సందలి Ae 1-00 వ్యవసాయ భూమి యీ హద్దుల మధ్య

తూర్పు : మురుగుకోడు,
దక్షిణం : సమయమంతుల సన్యాసయ్య & యితరుల భూమి,
పడమర: కమ్మిలి బదెమ్మ భూమి,
ఉత్తరం : బంధారు వారి భూమి

నా క్లయింటుకు గల Ae 1-00 భూమి అన్యాక్రాంతం కాకుండా ఉండు నిమిత్తం శ్రీ భీమవరం సివిల్ జడ్జి సీనియర్ డివిజన్ వారి ఎదుట O.S.NO.52/2025 దావా చేసి యున్నారు. పైన తెలిపిన ఆస్తికి నా క్లయింటు అయిన కరణపు (కరణం) వెంకట రమణ పూర్తి హక్కు దారుగుట వలన ఇంకెవ్వరికి ఎటువంటి హక్కులు లేనందున ఈ ఆస్తిపై నా క్లయింటు తప్ప ఇంకెవ్వరూ ఎటువంటి లావాదేవీలు చేసినప్పటికి అవి చెల్లనేరవని, తామెల్లరకు యిందుమూలంగా తెలియజేయడమైనది.

ఇట్లు,
రుద్రరాజు పద్మనాభరాజు
ఆర్.వి.ఎస్.ఎస్. సునీత
అడ్వకేట్స్, విస్సాకోడేరు,
సెల్ : 98496 35172